క్లుప్తంగా

కరుమారియమ్మకు ప్రత్యేక పూజలు



నింద్ర: మండల కేంద్రంలోని ఓం శక్తి ఆలయంలో బహుళ పాడ్యమి సందర్భంగా శ్రీకరుమారియమ్మకు శనివారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేక పూజల అనంతరం సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేశారు. తీర్థప్రసాదాలు అందజేశారు.

జగనన్న ఇళ్లకు దరఖాస్తు చేసుకోండి



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ కృష్ణయ్య

శ్రీరంగరాజపురం: గంగాధరనెల్లూరు నియోజకవర్గానికి అదనంగా 1,832 జగనన్న ఇళ్లు మంజూరయ్యాయని, అందులో 351 ఇళ్లు మండలానికి కేటాయించారని జెడ్పీటీసీ సభ్యుడు రమణప్రసాద్ రెడ్డి తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ అర్హులైన వారు గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం యజ్ఞంలా ఇళ్లు మంజురు చేయడమే కాకుండా, లబ్ధిదారులకు ఉచితంగా ఇసుక, రాయితీతో సిమెంట్ అందిస్తోందని తెలిపారు. అనంతరం 50 బసివిరెడ్డిపల్లె జగనన్న కాలనీ పరిశీలించి, పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఎంపీడీఓ కృష్ణయ్య, హౌసింగ్ ఏఈ శ్రీధర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ కుమార్, నాయకులు మణి, బాషా, రవి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



సాయం అందిస్తున్న రామ్‌ప్రసాద్ రెడ్డి

నగరి: మున్సిపల్ పరిధి సత్రవాడ దళితవాడలో అగ్నిప్రమాదంలో ఇల్లు కోల్పోయిన వళ్లియమ్మ కుటుంబానికి మంత్రి ఆర్కే రోజా ఆర్థిక సాయం చేశారు. ఈమేరకు శనివారం మంత్రి క్యాంపు కార్యాలయంలో రోజా చారిటబుల్ ట్రస్టు నుంచి రూ.20 వేలు సాయాన్ని మంత్రి సోదరుడు, వైఎస్సార్‌సీపీ నేత రామ్‌ప్రసాద్‌రెడ్డి అందజేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బాలన్ పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత

నగరి మండలంలోని వేలావడి గ్రామానికి చెందిన లత, ఎస్.సాల్మన్ కుటుంబాలకు వైఎస్సార్ బీమా పంపిణీ చేశారు. ఇటీవల వీరిద్దరు అనారోగ్యంతో మృతి చెందారు. ఒక్కో కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకం కింద రూ.లక్ష మంజూరైంది. శనివారం మంత్రి క్యాంప్ కార్యాలయంలో బీమా చెక్కును వైఎస్సార్‌సీపీ నేత రాంప్రసాద్ రెడ్డి అందజేశారు.

ఆస్పత్రికి వీల్‌చైర్స్ వితరణ



నగరి: ఏరియా ఆస్పత్రికి పట్టణ పరిధిలోని శిరీడ్స్ బుద్ధి మాంధ్యం పిల్లల పాఠశాల సంస్థ నిర్వాహకురాలు గిరిజ మూడు వీల్‌చైర్స్‌ను వితరణగా అందించారు. శనివారం ఆస్పత్రికి విచ్చేసిన ఆమె ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ బాలకృష్ణనాయక్‌ను కలసి వాటిని అందజేశారు. ఆర్ఎంవో డాక్టర్ గోపాల్, నర్సింగ్ సూపరింటెండెంట్ రాజరత్నమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో స్పందన అర్జీలు

పాలసముద్రం: గ్రామ సచివాలయాల స్పందన కార్యక్రమంలో వచ్చే అర్జీలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఎంపీడీఓ ఎస్.విద్యావతి తెలిపారు. శనివారం కృష్ణజమ్మపురం సచివాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. సిబ్బందితో ఆమె మాట్లాడుతూ అర్జీలను ఆన్‌లైన్‌లో పెడితే వాటిని సంబంధిత అధికారులు పరిశీలించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు.

నీటిని పొదుపుగా వాడాలి



కార్వేటినగరం: ప్రజలు తాగునీటిని పొదుపుగా వాడుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు అన్వశగన్, ఎంపీటీసీ సభ్యుడు గోవిందరాజు తెలిపారు. శనివారం పాలసముద్రం గ్రామ సచివాలయంలో సర్పంచ్ అయ్యప్ప, పంచాయతీ కార్యదర్శి నరేష్ ఆధ్వర్యంలో జలశక్తి అభియాన్ గ్రామ సభ నిర్వహించారు. వారు మాట్లాడుతూ నీటిని అవసరం మేరకే వాడుకోవాలన్నారు. నీటిని వృథా చేయమని ప్రతిజ్ఞ చేశారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

సమస్యలు వింటూ.. సంక్షేమాన్ని వివరిస్తూ..!

- అర్హతే కొలమానం..అభివృద్ధే ధ్యేయం
- జగనన్నను పెద్ద కొడుకుగా చూస్తున్నారు
- ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి



సమస్యలను తెలుసుకుంటున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

వెదురుకుప్పం: గడప గడపకు వెళ్లి సమస్యలను తెలుసుకుంటూ...జగనన్న ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి తానున్నానంటూ భరోసా ఇచ్చారు. శనివారం మండలంలోని బ్రాహ్మణపల్లె గ్రామ సచివాలయ పరిధిలోని నెమలగుంట, కాపు మొండివెంగనపల్లె, బలిజమొండి వెంగనపల్లె, బండమీద ఇండ్లు గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో నారాయణస్వామి పాల్గొన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి పథకాల ద్వారా ఎంత లబ్ధి చేకూరిందో అంకెలతో సహా వివరించారు. ప్రజల విన్నవించిన సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పార్టీలకతీతంగా పలువురు చెప్పిన సమస్యలను ఓపికగా విని, తప్పకుండా ప్రజలకు మంచి కార్యక్రమాలు చేద్దామని మంత్రి తెలిపారు. ఆయా గ్రామాల్లో మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. నెమలగుంట గ్రామంలో విద్యుత్ లైన్లు తొలగించాలని అధికారులను ఆదేశించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలం మంజూరు చేయాలని రెవెన్యూ అధికారులకు సూచించారు.

అర్హతే ప్రామాణికం

సీఎం జగన్ మోహన్‌రెడ్డి నవరత్నాల ద్వారా అందిస్తున్న పథకాలకు కేవలం అర్హతే ప్రామాణికమని, పథకాల లబ్ధిలో ఎలాంటి తారతమ్యాలకు తావివ్వకుండా చేరవేస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లో ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంట్లో సంక్షేమ పథకాలతో పేదలు ఆనందంగా ఉన్నట్లు చెప్పారు. కనివినీ ఎరుగని రీతిలో సంక్షేమ పథకాలను అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రతి ఇంట్లో పెద్దకొడుకుగా భావిస్తున్నారని తెలిపారు. మండలంలో కొత్తగా 380 పింఛన్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. 8,028 మందికి గాను నెలకు మొత్తం రూ.2.18 కోట్లు ఇస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఇంటికీ మేలు చేస్తున్న జగనన్నను రానున్న ఎన్నికల్లో ఆశీర్వదించాలని కోరారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ నాగరాణి, జెడ్పీటీసీ సభ్యుడు సుకు మార్, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బట్టె సుబ్రమణ్యం, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండి హేమసుందర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి పద్మనాభ రెడ్డి, మండల అధ్యక్షుడు పేట ధనుంజయరెడ్డి, ఎంపీడీఓ సుధాకరరావు, తహసీల్దార్ పుల్లారెడ్డి, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు రామయ్య, మాజీ ఎంపీపీ పురుషోత్తం, సర్పంచ్‌లు లలిత, శిల్ప, మాజీ సర్పంచ్‌లు శ్యామల, గోవిందన్, బాలకృష్ణారెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ మునికృష్ణారెడ్డి, బొజ్జారెడ్డి, దామోదరరెడ్డి, భూపాలయ్య పాల్గొన్నారు.

మంత్రి రోజాను విమర్శించే స్థాయి లేదు



నాయకులతో కలిసి మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ హరి

పుత్తూరు రూరల్: పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజాను విమర్శించే స్థాయి టీడీపీ నగరి బాధ్యుడు గాలి భానుప్రకాష్‌కు లేదని, ప్రజలకు మీరు చేసిన మంచి పని ఒకటి చెప్పగలరా? అని మున్సిపల్ చైర్మన్ ఏ.హరి ధ్వజమెత్తారు. శనివారం పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హరి మాట్లాడుతూ చుట్టపు చూపుగా వచ్చి మంత్రి రోజాపై అడ్డదిడ్డంగా విమర్శలు చేస్తే తగిన రీతిలో బుద్ధి చెప్పాల్సి ఉంటుందని హెచ్చరించారు. మహిళా మంత్రి అన్న కనీస మర్యాద లేకుండా ఏక వచనంతో మాట్లాడడం నీచ సంస్కృతికి నిదర్శనమని మండిపడ్డారు. మంత్రి రోజాను విమర్శిస్తే హోదా పెరుగుతుందని అవాకులు చవాకులు పేలితే ఖబడ్దార్ అన్నారు. గత టీడీపీ పాలనలో పుత్తూరు పట్టణం అభివృద్ధి గతి తప్పితే, నేడు పర్యాటక శాఖ మంత్రి రోజా నేతృత్వంలో అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని చెప్పారు. 2014 నుంచి 2018 వరకు టీడీపీ హయాంలో మున్సిపాలిటీ అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందం అన్న విషయం ప్రజలందరికీ తెలిసిందేనని తెలిపారు. 2019లో రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క పుత్తూరు పట్టణంలోనే రూ.185.78 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభం కాగా, ఇప్పటికే రూ.25.24 కోట్ల మేర పనులు పూర్తయ్యాయని చెప్పారు. ఇందులో అత్యంత ప్రధానమైన రూ.139 కోట్లతో శ్రీకాళహస్తి తెలుగుగంగ కాలువ నుంచి పుత్తూరు ఎస్ఎస్ ట్యాంకుకు పైపులైను పనుల నిర్మాణం శరవేగంగా జరుగుతోందని తెలిపారు. గత పాలకులు చేయలేక వదిలేసిన పాలిటెక్నిక్ కళాశాల భవన నిర్మాణాలను రూ.7.60 కోట్లతో పూర్తి చేసిన ఘనత మంత్రి రోజాదని తెలిపారు. అలాగే రూ.1.10 కోట్లతో మున్సిపల్ పార్క్, రూ.25 లక్షలతో ద్రౌపదీదేవి ఆలయ రాజగోపురం పనులు పూర్తి చేసి ప్రారంభించినట్లు చెప్పారు. నాడు–నేడు పథకం ద్వారా ఫస్ట్ ఫేస్‌లో రూ.4.61 కోట్ల వ్యయంతో 18 పాఠశాలలను ఆధునీకరించినట్లు చెప్పారు. రూ.2 కోట్లతో మున్సిపల్ భవన నిర్మాణం, రూ.1.85 కోట్లతో షాదీ మహల్, రూ.1.60 కోట్లతో రెండు అర్బన్ హెల్త్ సెంటర్ల నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. కళ్లు తెరుచుకుని అభివృద్ధిని చూడాలని సలహా ఇచ్చారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శంకర్, కౌన్సిలర్లు ఏకాంబరం, గుణశేఖర్, చిట్టిబాబు, బాలాజీ, వైఎస్సార్‌సీపీ నాయకులు జయబాబు, మోహన్‌రెడ్డి, మునెయ్య, కుట్టి, కుమార్‌రెడ్డి, తిరునావక్కరుసు, బుజ్జి, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు అంకితభావం అవసరం



విద్యార్థుల సామర్థ్యాన్ని తెలుసుకుంటున్న జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి

గంగాధరనెల్లూరు: ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధించాలన్నారు. విద్యలో వెనుకబడిన విద్యార్థుల్ని గుర్తించి ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. తరగతి గదుల్ని పరిశీలించారు. ప్రశ్నలు వేసి విద్యార్థుల సామర్థ్యాన్ని తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టాలన్నారు. నాడు–నేడు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు.

శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలి



మాట్లాడుతున్న జేవీవీ వ్యవస్థాపకుడు బ్రహ్మారెడ్డి

కార్వేటినగరం: విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించి విజ్ఞాన సమాజాన్ని నిర్మించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని జన వి/్ఞాన వేదిక వ్యవస్థాపకుడు డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి అన్నారు. శనివారం జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్) ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించడం ద్వారా తెలుసుకోవాలనే తపన పెరుగుతుందని, తద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయతను పెపొందించవచ్చని తెలిపారు. సామాజిక రుగ్మతలకు అశాస్త్రీయ వైఖరులే కారణమని ఉదాహరించారు. కాబోయే ఉపాధ్యాయులుగా నవ వి/్ఞాన సమాజ నిర్మాణం మీ చేతుల్లోనే ఉందని వివరించారు. డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ చెంగల్‌రాజు, ఆదర్శ పాఠశాల హెచ్‌ఎం గాజుల నాగేశ్వరరావు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజియులురెడ్డి, డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ వెంకట రమణారెడ్డి, అధ్యాపకులు ప్రభాకర్, వెంకటరమణ, శ్రీనివాసులురెడ్డి, నిర్మల, సునీత, అనిత, వరలక్ష్మి, సూపరింటెండెంట్ కృపావతి పాల్గొన్నారు.


అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఆర్డీవో, అధికారులు

నగరి: ఆర్డీవో కార్యాలయంలో శనివారం నగరి, విజయపురం, కార్వేటినగరం మండలాలకు సంబంధించి అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం పది పోస్టులకు 23 మంది హాజరయ్యారు. ఆర్డీవో సుజన ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు జరిగాయి. నగరి మండలంలోని కొత్తపేట–2 అంగన్‌వాడీ వర్కర్ పోస్టు, మాండాడు దళితవాడ, టీఆర్ కండ్రిగ అంగన్ వాడీ హెల్పర్, విజయపురం మండలం కోసలనగరం అంగన్‌వాడీ హెల్పర్, కార్వేటినగరం మండలం శీకాయపట్టెడ, పద్మసరస్సు, జగన్నాథపురం అంగన్‌వాడీ వర్కర్ పోస్టులకు, కొటార్వేడు, దిగువ వనదుర్గాపురం, గాజంకి అంగన్ వాడీ హెల్పర్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులను ఎంపిక చేశారు. జిల్లా స్త్రీ,శిశు సంక్షేమ అధికారి ఎస్.నాగశైలజ, బుగ్గ అగ్రహారం పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ రమేష్‌కుమార్, నగరి, కార్వేటినగరం, పిచ్చాటూరు సీడీపీవోలు కృష్ణవేణి, పద్మసునంద, శోభారాణి, ఐసీడీఎస్ సిబ్బంది కె.కరుణాకర్‌రెడ్డి, గిరిజమ్మ, సకన్య, పూర్ణచంద్ర, గోపి, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

వేప చెట్టు నుంచి పాలు



వేప చెట్టు నుంచి కారుతున్న పాలు

వెదురుకుప్పం: మండలంలోని కురివికుప్పం పంచాయతీ పరిధి అడపాలబైలు గ్రామ సమీపంలో ఓ వేప చెట్టు నుంచి పాలు కారడం స్థానికులను ఆశ్చర్యానికి గురిచేసింది. వేప చెట్టు పైకొమ్మ నుంచి పాలు కారుతున్నట్లు తెలియడంతో చుట్టు పక్కల గ్రామాల ప్రజలు కూడా అక్కడికి వచ్చి తిలకించారు. అదేదో వింత అంటూ ఒకింత విస్మయానికి లోనయ్యారు. అయితే అది వింత కాదని, శాస్త్రీయమని జన విజ్ఞాన వేదిక మండల నాయకుడు మునిరత్నం స్పష్టం చేశారు. వేపకాండంమీద పగుళ్లు ఉన్నప్పుడు ఎన్నో జీవులు, శిలీంద్రాలు, లక్షలాది పురుగులు నివాసం ఉంటూ చనిపోతాయన్నారు. కొంత కాలానికి అది ద్రవంగా మారి వేపకాండం, బెరడు నుంచి పాలుగా కారుతుందని వివరించారు. వింతేమి కాదని, మూఢ నమ్మకాలను ప్రజలు వీడాలని తెలిపారు.

భాను నోరు అదుపులో పెట్టుకో



నగరి: సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు

నగరి: టీడీపీ నియోజక బాధ్యుడు గాలి భానుప్రకాష్ నోరు అదుపులో ఉంచుకోవాలని వైఎస్సార్ సీపీ నాయకులు హెచ్చరించారు. మంత్రి ఆర్కేరోజాను ఉద్దేశించి భాను చేసిన అనుచిత వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం బస్టాండు ప్రాంగణంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద నాయకులు సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వంలో పార్టీలు,కులమతాలకు అతీతంగా జరుగుతున్న సంక్షేమ పథకాల అమలుతో టీడీపీని ఆపార్టీ కార్యకర్తలే మరచిపోయారన్నారు. ప్రజల బాగోగులు ఆలోచించే ప్రభుత్వం కాబట్టే రోడ్డుపై షోలు అపుదల చేసిందన్నారు. దాన్ని చీకటి జీవోగా అభివర్ణించే భాను రాజకీయ అజ్ఞాని అని విమర్శించారు. చారిటబుల్ ట్రస్టు ద్వారా కోవిడ్‌లో సైతం మంత్రి రోజా విశేష సేవలు అందించారని తెలిపారు. ముద్దుకృష్ణమ కుమారుడు అన్నది మినహా స్వతహాగా ఉన్న అర్హత ఏమిటో తెలుసుకుంటే మంచిదని హితవు పలికారు. విజయపురం వైస్ ఎంపీపీ మంజుబాలాజీ, నింద్ర కోఆప్షన్ సభ్యులు అనిల్ కుమార్, ఆనంద్‌కుమార్, కౌన్సిలర్ మురుగయ్య, ఆస్పత్రి కమిటీ సభ్యులు కృష్ణమూర్తి, ఎంపీటీసీ సభ్యుడు విజేష్, యోవాన్, వెంకీ, సత్యరాజ్, మహేష్, సుధాకర్, నాయకులు శంకర్, తులసి, బాలాజీ, సత్య, చిరంజీవి, నజిత్, విజయ్ కుమార్,అజిత్, తరుణ్, శివ తదితరులు పాల్గొన్నారు.

సులభ రీతిలో పాఠ్యాంశాల బోధన



సూచనలిస్తున్న డీఈఓ శేఖర్

వడమాలపేట: విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధించాలని, విద్యలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని తిరుపతి జిల్లా విద్యాశాఖాధికారి శేఖర్ సూచించారు. శనివారం ఉదయం వడమాలపేట బాలుర పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. పాఠశాలలో అమలు చేస్తున్న అకడమిక్ క్యాలెండర్, యాన్యువల్ బడ్జెట్ వర్కు ప్లాన్‌పై ఉపాధ్యాయులను ఆరా తీశారు. విద్యార్థులను ప్రశ్నించి సామర్థ్యాన్ని పరిశీలించారు. రికార్డుల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంఈఓ పద్మావతి, హెచ్‌ఎం భువనేశ్వరి, క్లస్టర్ హెచ్‌ఎంలు, సీఆర్పీలు పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఆర్జేడీ రమేష్

వెదురుకుప్పం: విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని ఇంటర్మీడియెట్ ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి రమేష్(తిరుపతి) అన్నారు. మండలంలోని చవటగుంట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నాడు–నేడు పనులను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ నాడు–నేడు పనుల్లో అధ్యాపకులు భాగస్వాములు కావాలన్నారు. అనంతరం దాతల సాయంతో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను పరిశీలించారు. ప్రిన్సిపల్ నిర్మలాకుమారి, అధ్యాపకులు ఢిల్లీప్రసాద్‌రెడ్డి, సభాపతిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు

యాదమరి: గ్రామీణ ప్రాంతాల్లోని చిన్నారులందరికీ వ్యాధి నిరోధక టీకాలు వేయాలని వైద్యాధికారి శ్రీనివాస్ నాయక్ తెలిపారు. శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం, కోడిగుట్ట ఆరోగ్య ఉపకేంద్రంలో చిన్నారులకు వైద్య సిబ్బంది వేస్తున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతు వైద్య సిబ్బంది టీకాలు వేయడంతోపాటు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. సీహెచ్ఓ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేతో భూ సమస్యల పరిష్కారం

నింద్ర: భూముల రీ సర్వేతో సమస్యలు పరిష్కారమవుతాయని తహసీల్దార్ అమరేంద్రబాబు తెలిపారు. శనివారం మండలంలోని చవరంబాకంలో భూ రీసర్వే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. అధికారులకు రైతులు సహకరించి తమ భూములకు కచ్చితమైన సరిహద్దులు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. సర్వేయర్లు వెంకటేశులు, శేఖర్, సర్పంచ్ మనోహర్‌నాయుడు, మాజీ సర్పంచ్ సత్యరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన పెన్షన్ల పంపిణీ



పెన్షన్లు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

నగరి: మున్సిపల్ పరిధి కరకంతాపురంలో నూతన పెన్షన్లను ప్రజా ప్రతినిధులు పంపిణీ చేశారు. శనివారం సచివాలయం వద్ద అర్హతలను పరిశీలించి 40 మందికి, కొత్త పెన్షన్లు 21 మందికి అందజేశారు. కౌన్సిలర్ మురుగ, కోఆప్షన్ సభ్యుడు ఎల్లప్పరెడ్డి, వలంటీర్లు పాల్గొన్నారు.

ఎమ్మార్పీకే వస్తువుల విక్రయం

తిరుపతి అర్బన్: జిల్లాలోని ఆర్టీసీ బస్టాండ్ల దుకాణాల్లో ఎమ్మార్పీ ధరలకే వస్తువులను విక్రయించాలని జిల్లా ప్రజా రవాణా అధికారి చెంగల్‌రెడ్డి ఆదేశించారు. అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని చెప్పారు. తీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కార్వేటినగరంలో అభివృద్ధి పరుగులు





జీలావారి కండ్రిగలో ప్రారంభానికి సిద్ధంగా ఆర్వో ప్లాంటు, ఆర్కేవీబీపేటలో ఓవర్ హెడ్ ట్యాంకు

కార్వేటినగరం: మండలంలో ఉపముఖ్యమంత్రి కె.నారాయణస్వామి చొరవతో అభివృద్ధి పనులు పరుగులు తీస్తున్నాయి. ఆర్కేవీబీపేట, కేశవకుప్పం పంచాయతీల్లో పలు అభివృద్ధి పనులు పూర్తి చేసుకుని ప్రారంభానికి ముస్తాబయ్యాయి. ఆర్కేవీబీ పేట పంచాయతీ ఇందిరా కాలనీలో ఆర్వో ప్లాంట్, ఆర్కేవీబీపేటలో రూ.15 లక్షలతో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంకు, రాజుల కండ్రిగలో ఆర్వో ప్లాంట్, ఎంఎం విలాసం గ్రామంలో 15 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ భవనం, మునిరెడ్డి కండ్రిగ దళితవాడలో ఆర్వో ప్లాంట్, కేశవకుప్పం పంచాయతీ జీలావారి కండ్రిగలో ఆర్వోప్లాంట్ ప్రారంభానికి సిద్ధమయ్యాయి. వీటిని ఈనెల 9వ తేదీన ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి ప్రారంభించనున్నారని ఎంపీపీ లత తెలిపారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మాదక ద్రవ్యాలతో జీవితాలు ఛిద్రం



మాట్లాడుతున్న ఎస్ఈబీ సీఐ నాగరాజు

కార్వేటినగరం: మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని ఎక్సైజ్ సీఐ నాగరాజు అన్నారు. శని వారం జిల్లా విద్యాశిక్షణా సంస్థ (డైట్)లో మాద్యక ద్రవ్యాల వాడకం– అనర్థాలపై ఛాత్రోపాధ్యా యులకు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ చెంగల్ రాజు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన సీఐ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు వినియోగిస్తే విచక్షణా జ్ఞానాన్ని కోల్పోతారని తెలిపారు. శారీరక రుగ్మతులతో చిన్న వయస్సులోనే అనేక సమస్యలు ఎదుర్కోవలసి వస్తుందని తెలిపారు. సరదాగా మొదలయ్యే ఈ అలవాటు చివరికి బానిసలుగా మారి నేరాలు చేసేందుకు కూడా వెనకాడని పరిస్థితికి చేరుకుంటారని తెలిపారు. స్నేహాలు, బాంధవ్యాలకు దూరమై ఒంటరిగా కుంగితారని తెలిపారు. విద్యాసంస్థల పరిసరాల్లో మాదక ద్రవ్యాల అమ్మకాలు జరుగుతున్నట్లు తెలిస్తే ఎస్ఈబీ టోల్‌ఫ్రీ నంబర్ 14500కు సమాచారం అందించాలని తెలిపారు. ఎస్ఐలు జయశంకర్, భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

బాలకృష్ణమ్మ సేవలు చిరస్మరణీయం



మాట్లాడుతున్న చెంగల్‌రాయమందడి

పుత్తూరు రూరల్: ఉపాధ్యాయ ఉద్యమ యోధుడు మార్పు బాలకృష్ణమ్మ సేవలు చిరస్మరణీయమని ఏపీటీఎఫ్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి చెంగల్ రాయమందడి పేర్కొన్నారు. శనివారం సాయంత్రం స్థానిక పెన్షనర్స్ భవనంలో బాలకృష్ణమ్మ వర్థంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పాత పింఛన్ విధానం, మాస్టర్ స్కేళ్లతో పీఆర్‌సీ సాధించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ప్రభుత్వ విధానాలపై కచ్చితమైన అభిప్రాయాలు చెప్పే వ్యక్తిగా పేరుగడించారని కొనియాడారు. అంతకు ముందు ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కిరణ్, నాదముని, తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటముని, నాయకులు మావృక్షయ్య, రాజేంద్రబాబు, నరేంద్ర, త్యాగరాజునాయుడు, గోవిందయ్య, రమేష్, కుప్పయ్య, కన్నెప్ప, రుద్రమూర్తి, సురేష్ పాల్గొన్నారు.

విద్యార్థుల వివరాలు పక్కాగా నమోదు చేయాలి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంఈఓ

నగరి: పాఠశాల హేబిటేషన్ ప్లాన్, స్కూల్ డెవలప్‌మెంట్ ప్లాన్‌లో బడి బయట పిల్లల వివరాలు, ప్రత్యేక అవసరాల పిల్లల వివరాలను నిజాయితీగా, పక్కాగా నమోదు చేయాలని ఎంఈవో శ్రీదేవి అన్నారు. శనివారం స్థానిక బాలికల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఐదు సీఆర్సీలకు చెందిన 42 మంది ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పాఠశాలకు సంబందిత ప్రణాళికలు సిద్ధ చేయడంలో నమోదు చేసే వివరాల మేరకే బడ్జెట్ మంజూరు అవుతుందని తెలిపారు. నాడు–నేడు పనులపై ఆరాతీశారు. పాఠశాలకు అవసరమైన మౌలిక సదుపాయాలను గుర్తించి, పీసీ కమిటీలో చర్చించి 2023–24 బడ్జెట్ ప్రపోజల్స్‌లో చూపించాలన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

నగరి: మున్సిపల్ పరిధి దొమ్మరిల్లు ఎస్టీకాలనీలోని ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వహణను ఎంఈవో శ్రీదేవి శనివారం తనిఖీ చేశారు. మెనూ ప్రకారం పొంగల్, పప్పు, గ్రీన్ చట్నీ అందిస్తుండడంతో వాటిని భుజించి నాణ్యతను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం నిర్వహణ బాగుందని ప్రశంసించారు. పాఠశాలలో నాడు–నేడు పనులు పరిశీలించారు. ఫ్లోరింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని హెచ్‌ఎంకు సూచించారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



మాట్లాడుతున్న కోఆర్డినేటర్ అజయకుమార్

వెదురుకుప్పం: విద్యతోనే ఉజ్వల భవిష్యత్ సిద్ధిస్తుందని ఏఎల్ఎస్ కో–ఆర్డినేటర్ అజయకుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని తిరుమలయ్యపల్లె జెడ్పీ హైస్కూల్‌ను ఆయన సందర్శించారు. పాఠశాలకు గైర్హాజరైన షికారీ కాలనీలోని పిల్లలకు విద్య ఆవశ్యకతను తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ పేద పిల్లలు ఉన్నత చదువులు చదవాలన్న ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. విద్యతో సామాజిక పరిజ్ఞానంతోపాటు ఉపాధి అవకాశాలు వస్తాయని తెలియజేశారు. అసిస్టెంట్ సీఎంఓ ఉదయలక్ష్మి, సీఆర్పీలు షణ్ముగం, మనోహర్‌వర్మ, హెచ్‌ఎం కరుణానవనీతం, ఉపాధ్యాయులు వరాలు, దేశమ్మ, గీత, సురేష్ పాల్గొన్నారు.